
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 21 మే 2025



విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాల్సిందే

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు విద్యాహక్కు చట్టాన్ని తాము అమలు చేయబోమని ప్రకటించడం సరి కాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాలలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి 25 శాతం ఉచిత ఇవ్వని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.



జిల్లా కేంద్రంలో సోలార్ పవర్ ప్లాంట్

- ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో 1.4 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు
- ఏటా 22 లక్షల యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి
- ఆసమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఎన్‌పీడీసీఎల్ 1.4 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఒకటి రెండు రోజుల్లో హైదరాబాద్‌కు చెందిన ఆసమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అగ్రిమెంట్ కుదుర్చుకోనున్నది. ఈ సంస్థ సోలార్ పవర్ ప్లాంట్‌ను నెలకొల్పడంతోపాటు 25 సంవత్సరాలపాటు నిర్వహణ బాధ్యతను తీసుకుంటుంది. ఇదే సామర్థ్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో కూడా ఎన్‌పీడీసీఎల్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నది. ఈ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా 22 లక్షల యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి కానున్నది.

హౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్ పక్కన

హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పక్కన ఎన్‌పీడీసీఎల్‌కు ఉన్న 5 ఎకరాల 15 గుంటల ఖాళీ స్థలంలో ఈ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే భూమిని చదును చేయడంతోపాటు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఈ పవర్ ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత జిల్లా కేంద్రంలో ఎలాంటి పవర్ కొరత, అంతరాయాలు జరిగే అవకాశం ఉండదు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సోలార్ పవర్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీంతో పట్టణవాసులకు నిరంతర విద్యుత్ అందే అవకాశం ఉన్నది. 22 లక్షల యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి కానున్న నేపథ్యంలో ఆ మేరకు విద్యుత్ కొనుగోలు తగ్గనున్నది. ఎన్‌పీడీసీఎల్ ఈ మేరకు ఆసమ్ సంస్థతో అగ్రిమెంట్ కుదుర్చుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒకటి రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తయి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలుస్తున్నది.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 22న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వైశ్యభవన్ వద్ద బీజేపీ శ్రేణులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఏక్తాయాత్రను వైభవంగా నిర్వహించడానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా యాత్రకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ వై సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, కన్నబోయిన ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, బండ రమణారెడ్డి, దండు కొమురయ్య, మాజీ కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, వంగల పవన్, సతీష్, దుర్శెట్టి అనూప్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, లడ్డు ముందడా, చిట్టి కరుణాకర్, అడిచెర్ల రాజు, తనుకు సాయి, అవుదుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా చర్యలు

- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

కరీంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వానాకాలం జిల్లాకు కావాల్సిన విత్తనాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 97,200 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలే కాకుండా విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన వరి విత్తనాలు 1.20 లక్షల క్వింటాళ్లు, కంది 150 క్వింటాళ్లు, పెసర 200 క్వింటాళ్లు, మినుములు 400 క్వింటాళ్లు, వేరుశెనగ 1775 క్వింటాళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విత్తనాభివృద్ధి సంస్థకు చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఉమ్మడి జిల్లా ప్రాంతీయ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, విత్తన అధికారి మౌనిక, మండల వ్యవసాయ అధికారులు, తెలంగాణ సీడ్ కార్పొరేషన్ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ అభినందనీయం

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రతిభ అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం సప్తగిరికాలనీలో కేజీబీవీలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతి థిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 కేజీబీవీల నుంచి వంద మంది విద్యార్థినులకు ఈ నెల 6వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చామని అన్నారు. సంగీతం, నృత్య ప్రదర్శన, పెయింటింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, ఆర్ట్ క్రాఫ్ట్ వంటి వాటిల్లో కేజీబీవీ విద్యార్థినులు శిక్షణ పొందారని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన కేజీబీవీ విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కేజీబీవీ విద్యార్థుల యోగా, నృత్యం, ఆర్ట్ క్రాఫ్ట్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, నెహ్రూ యువకేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టర్‌ను కలిసిన జిల్లా రిజిస్ట్రార్

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. కొత్తపల్లిలోని సర్వే నంబర్ 175, 197, 198లలోని దాదాపు 20 ఎకరాల సీలింగ్ లాండ్‌కు సంబంధించిన అక్రమంగా 476 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటిని రద్దు చేయాలని హైకోర్టు ఆదేశించడంతో కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 476 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దుచేసే ప్రక్రియపై డీఆర్ ఒక నివేదికను కలెక్టర్‌కు సమర్పించి, రద్దు ప్రక్రియపై చర్చించినట్లు సమాచారం. డాక్యుమెంట్లు రద్దు చేసేందుకు ఒక అధికారిని గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యూట్ చేసి, ఆ అధికారితో డాక్యుమెంట్లు రద్దు చేయనున్నారు. దీనిపై కలెక్టర్, డీఆర్ కసరత్తు చేసినట్లు తెలిసింది. కొత్తపల్లి సీలింగ్ భూమికి సంబంధించిన మొత్తం 476 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల వివరాలను డీఆర్ కలెక్టర్‌కు వివరించినట్లు సమాచారం. సీలింగ్ భూమి వివాదం కోర్టులో ఉండగా రిజిస్ట్రేషన్లు ఎలా చేశారు, ఎవరు బాధ్యులు, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా.. అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినవాటిని తక్షణమే రద్దు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ డాక్యుమెంట్లు రద్దు చేసిన తరువాత ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. సీలింగ్ భూమి అని తెలిసినా ఆ సర్వే నంబర్లలోని భూమిని ఇంటి నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖ మధ్య సమన్వయలోపం కనిపిస్తున్నది.

రిజిస్ట్రేషన్ ప్రతాలతో జిల్లా కేంద్రానికి గంగాధర ఎస్ఆర్‌వో

గంగాధర: కలెక్టర్ పమేలా సత్పతి అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు చేయడంతో గంగాధర ఎస్ఆర్‌వో నూర్ ఖాన్ సంబంధిత పత్రాలతో జిల్లాకేంద్రానికి వెళ్లారు.

కొత్తపల్లి మండలంలోని 175, 197,198 సర్వే నంబర్లలోని సీలింగ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏ ఆధారాలతో రిజిస్ట్రేషన్లు జరిగాయో వాటి వివరాల పత్రాలను సేకరించి కలెక్టర్, డీఆర్‌వోలకు సమర్పించడానికి ఎస్ఆర్‌వోతో పాటు సీనియర్ అసిస్టెంట్ జిల్లా కేంద్రానికి వెళ్లారు. 2018లో కరీంనగర్ రూరల్ నుంచి కొత్తపల్లి పరిధిని గంగాధర సబ్ రిజిస్ట్రార్ పరిధికి మార్చారు. నిషేధిత భూముల్లో 53 రిజిస్ట్రేషన్లు అప్పటి ఎస్ఆర్‌వో చేశారు.

బాక్సింగ్‌లో సత్తా చాటుతాం
- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం
- 55 మంది క్రీడాకారుల హాజరు

పెట్రోల్ బంకుల్లో పలు సేవలు
- సౌకర్యాలు పొందడం వినియోగదారుల హక్కు

వేగంగా ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం



మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు

గంగాధర,మే 20 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సందేహాలు నివృత్తి చేయడానికి మండల కేంద్రంలో ఒక మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తున్నారు. 600 చదరపు గజాలలోపు స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని నిబంధనలు పెట్టడంతో ఎంత ఖర్చవుతుందనే అనుమానాలు లబ్ధిదా రుల్లో నెలకొన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని సిమెంటు, స్టీల్, ఇసుక, కూలీలు తదితర ఖర్చులు తెలియజేయడానికి మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోడల వరకు పనులు జరిగాయి. మరో 15 రోజుల్లో ఇల్లు పూర్తవుతుందని మండల అధికారులు తెలిపారు.

దేశానికి రోల్ మోడల్ 'భూ భారతి'

- జూన్ 2 నుంచి ప్రతీ గ్రామానికి రెవెన్యూ అధికారి
- ఆరువేల మంది సర్వేయర్లకు శిక్షణ
- భూ సమస్యల పరిష్కారానికి ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



బ్యాంకు లింకేజీ ద్వారా మండల సమైక్యకు వచ్చిన రూ. 2.13 కోట్ల చెక్కును మహిళలకు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సైదాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి అమలుకు సైదాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 1600 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. న్యాయపరమైన సమస్యలన్నీ భూభారతి ద్వారా అధికారులు త్వరలోనే పరిష్కరిస్తారన్నారు. ధరణిలో చిన్నచిన్న పొరపాట్లను కూడా సవరించే అవకాశం ఉండకపోయేదన్నారు. భూ భారతిలో భూమి రిజిస్ట్రేషన్ చేసే సందర్భంలోనే సర్వే చేయించి ఆ మ్యాప్‌ను పాస్ పుస్తకంలో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. ఈ మ్యాప్ వల్ల భావి తరాలకు ఇబ్బందులు ఉండబోవన్నారు. ఆరువేల మంది సర్వేయర్లకు మూడు నెలలపాటు శిక్షణనిస్తున్నామన్నారు. మండలానికి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లు పని చేస్తారన్నారు. ఈ నెల 27 నుంచి సర్వేయర్లకు శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 2 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇక రెవెన్యూ అధికారి చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు. భూ భారతి చట్టం ద్వా రా ప్రభుత్వ, ప్రైవేటు సరిహద్దు పంచాయతీలు కొలిక్కి వస్తాయ న్నారు. ప్రతీ భూమికి భూధార్ నంబర్ వస్తుందని తెలిపారు.

అన్ని సేవలు ఉచితం

జూన్ 2నుంచి తహసీల్దార్ గ్రామాలకు వస్తారని, భూ సమస్యల దరఖాస్తులు వారికి అం దించాలని తెలిపారు. ఒక్క రూపాయి ఫీజు కూడా ఎవరికి చెల్లించాల్సిన పని లేదని, శాశ్వతంగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. దరఖాస్తు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. 18 రాష్ట్రాల్లో ఆరు నెలల పాటు పర్యటించి మంచి అంశాలను క్రోడీకరించి భూ భారతి చట్టం రూపొందిం చామన్నారు.

ప్రతీ పేదవాడికి ఇల్లు

ప్రతీపేదవాడికి గూడు ఉండాలన్న ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, మొదటివిడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అప్పుల భారం ఉన్నప్పటికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అనంతరం భూభారతిలో భూ సమస్యలు పరిష్కారం అయిన వారికి ప్రొసీడింగ్స్ అందజేశారు. సంతోషిమాత మండల సమైక్యకు బ్యాంకు లింకేజీ ద్వారా వచ్చిన 2.13 కోట్ల చెక్కును అందజేశారు. పీఎంఈజీ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్



రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ధరణి స్థానంలో భూ భారతి తీసుకొస్తామని హా మీ ఇచ్చిరని, ఇచ్చిన మాట ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి తెచ్చామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలో భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. చిగురు మామాడి, మానకొండూర్ కాలువ పనులు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తు న్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహా దారు హర్కార వేణుగోపాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, జిల్లా గ్రంథలాయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, సైదాపూర్, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్లు దొంత సుధాకర్, నిర్మల జయరాజ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకాల వస్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతినగా ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ఈదురు గాలుల వర్షం

● ఇంటిపై విరిగిపడిన కరెంటు స్తంభం

గంభీరావుపేట మే 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలుల వర్షం కురిసింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్ స్తంభం విరిగిపడ్డ సమయంలో ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ నిలిచిపోవడంతో కాలనీ అంధకారంగా మారింది. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని ముందే తీసేసి కొత్త స్తంభం ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత సెస్ సిబ్బంది విరిగిన పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు


శ్రీనివాస్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్‌ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కోనేటి శ్రీనివాస్(38) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సుధాకర్ తన ద్విచక్రవాహనంపై కూతురు సంధ్యతో కలిసి బొమ్మనపల్లికి వెళ్తున్నారు. మొగిలిపాలెం గ్రామానికి చెందిన చిన్నబోయిన రాహుల్ మొగిలిపాలెం నుంచి కొండపలకలకు వస్తుండగా కరీంపేట శివారులో బ్రిడ్జి మూల మలుపు వద్ద రాహుల్ సుధాకర్ బైక్‌ను ఢీకొట్టడంతో సుధాకర్‌కు కుడి కాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేపు కోసం తీసుకు వెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేత కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

●**కథలాపూర్:** మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి

వీణవంక,మే20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బంధు రెండో విడత నిధులను లబ్ధిదారుల అకౌంట్‌ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ దళితబంధు పైలట్ ప్రాజెక్ట్ హుజూరాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం మొదలు పెట్టిన లబ్ధిదారులకు మొదటి విడుత నిధులు విడుదల చేశాక వివిధ రకాల యూనిట్స్ పెట్టుకుని రెండో విడత నిధులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొటేషన్‌ల పేరిట దళారులు కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేసి వేంటనే దళితులను ఆదుకోవాలని కోరారు.

కొండంత పండుగ..


ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

● కొండగట్టులో ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు
● అంజన్నకు ప్రభుత్వం తరపున భద్రాచలం రాములోరి పట్టువస్త్రాలు
● ప్రారంభమైన త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవమూర్తులకు స్వస్తి వచనము, రక్షాబంధన ము, దేవతాహవనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేశాక స్థాపిత దేవ తారా. దన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, భద్రాచలం ఈవో రమాదేవి, స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేందర్‌ప్రసాద్, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, మారుతీ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

కొండగట్టు అంజన్నకు ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం రామాలయం నుంచి ఆలయ ఈవో ఎల్. రమాదేవి తదితరులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైజంక్షన్ నుంచి శోభాయాత్ర నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళాబృందాలు 108 దీపాల ప్రదర్శన, ఒగ్గు డోలు, కోలాటం, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.

తరలిరానున్న దీక్షాపరులు

గురువారం జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలినడకన కొండగట్టుకు వస్తున్నారు. మంగళవారం కొండ పైన దీక్షాపరులు సందడి అంతంత మాత్రమే కాగా, బుధవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జయంతి సందర్భంగా ఆలయాన్ని, యాగశాలను పూర్తి స్థాయిలో అలంకరించకపోవడంపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.




కళాకారుల ప్రదర్శనలు


పట్టువస్త్రాలను తీసుకువస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం ఈవో రమాదేవి, కొండకు వస్తున్న దీక్షాపరులు, స్వామివారి శోభాయాత్ర

టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు



మాట్లాడుతున్న టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్లలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కొండ లక్ష్మణ్‌బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలు పొందే విధి విధానాలు డిప్లొమా కోర్సులు, ఉపాధి మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌రావు మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో చేరడానికి చేనేత టెక్స్‌టైల్‌కు సంబంధించి 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 15 నుంచి 25 మధ్య వయస్సు కలిగిన విద్యార్థులు చేరవచ్చని వివరించారు. డైరెక్ట్‌గా రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్‌కు సంబంధించిన విద్యార్థులు చేరవచ్చని జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ 25 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. ఫీజు సంవత్సరానికి రూ.4,250 ఉంటుందని విద్యార్థులు నెలవారీగా రూ 2500 ఉపకార వేతనాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల సోదాలు


బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డులో అటవీశాఖ కార్యాలయం సమీపంలో గల ఓ ప్రముఖ బేకరీలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. బేకరీలో కాలం చెల్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను, ఫంగస్ గల ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు చేశారు. బేకరీలో నిల్వ ఉంచిన పలు ఆహార పదార్థాలను పరిశీలన జరిపారు. అనుమానం గల పలు ఆహార పదార్థాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ ప్యాకింగ్‌తో విక్రయించే ప్రతీ ఆహార పదార్థాలు నాణ్యత ఉండాలన్నారు. ప్యాకింగ్‌పై వాటి తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, ధర, ఎప్పటివరకు వినియోగించవచ్చన్న తదితర వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంల ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


పొత్తూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రాస్తారోకో

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన రైతులు బస్టాండ్ వద్ద నిరసన చేపట్టగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు సంఘీభావం ప్రకటించారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పట్నం అశ్వినిశ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కదురు శేఖర్, రైతులు రాజు, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, నర్సయ్య, గోవర్దన్‌రెడ్డి, సాంబశివరెడ్డి, మోహన్‌రెడ్డి, గౌరయ్య, రాజయ్య, రవి, గుంటి అంజయ్య, సాగర్, రాజమల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలి

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ, గురుకుల, కళాశాల వసతి గృహాలకు నాసిరకం సరకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాసిరకం సరుకులు, సరఫరా చేయడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. బి అంజయ్య, బి చిరంజీవి, బి సంతోష్ అనే వారు సుమారు అత్యధిక హాస్టళ్లకు కూరగాయలు, చికెన్, పండ్లు, గుడ్లను సరఫరా చేస్తున్నారని తెలిపారు. గతంలో సరఫరా చేసిన కూరగాయలు, పండ్లు, చికెన్, గుడ్లు నాసిరంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. వారిని బ్లాక్‌లిస్టులో పెట్టి వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

రెండు గ్రామాల మధ్య చేపల పంచాయతీ

● 23 మందిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల మధ్య చేపల పంచాయతీలో 23మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల, గ్రామ శివారులోని చింతల చెరువులో వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పట్టుకునేవారు. గత ఏడాది మల్యాల గ్రామస్థులు తమ చెరువులో తామే చేపలు పట్టుకుంటామని వాగొడ్డు రామన్నపల్లె వారిని అడ్డుకున్నారు. దీంతో వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు జిల్లా ఫిషరిస్ అధికారుల నుంచి చింతల చెరువులో చేపలు పట్టుకోవడానికి ఆర్డర్ తీసుకువచ్చారు. చెరువులోని చేపలు పట్టడానికి వాగొడ్డు రామన్నపల్లె వారికే హక్కులు ఉన్నాయని తహసీల్దార్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల వాగొడ్డు రామన్నపల్లెకు చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పడుతున్న క్రమంలో మల్యాల గ్రామస్థులు అక్కడికి చేరుకొని గొడవ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను శాంతింపజేశారు. తమ చేపల వలలు, 95 వేల రూపాయల విలువ చేసే చేపలను దొంగిలించారని వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు మల్యాలకు చెందిన 23మందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.


కాలువ పనులు అడ్డుకుంటున్న రైతు దయ్యాల నర్సయ్య

ఎల్లంపల్లి కాలువ పనులను అడ్డుకున్న రైతు

- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తన భూమికి నష్ట పరిహారం ఇవ్వకుండానే ఆధికారులు ఎల్లంపల్లి కాలువ పనులు చేస్తున్నారని దయ్యాల నర్సయ్య అనే రైతు కాలువ పనులను అడ్డుకున్నాడు. మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ చెరువుకు వెళ్లే ఎల్లంపల్లి కాలువ పనులు కొనసాగుతున్నాయి. అయితే కాలువ పనులు జరగకుండా నర్సయ్య కాలువ మధ్యలో కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు దయ్యాల నర్సయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 333లో 20 గుంటల భూమి ముంపునకు గురవుతున్నట్లు తెలిపాడు. తమ భూములకు నష్టపరిహారం చెల్లించకుండా కాలువ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం, ఇప్పటికైనా తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు.

కల్వర్టులో పడిపోయిన మినీ కంటైనర్

● అందులోనే ఇరుక్కున్నడ్రైవర్ ● బయటకు తీసిన స్థానికులు


డ్రైవర్‌ను బయటికి తీస్తున్న రెస్క్యూ టీం, స్థానికులు

తిమ్మాపూర్, మే 20, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి- నుస్తులాపూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టును ఓ మినీ కంటైనర్ ఢీకొని కల్వర్టులోకి పల్టీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ కాలు అందులోనే ఇరుక్కుపోవడంతో అతన్ని బయటకు తీసేందుకు సుమారు రెండు గంటలకు పైగా శ్రమించారు. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఓ ప్రైవేటు కొరియర్‌కు సం బంధించిన మినీ కంటైనర్ హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో డ్రైవర్ అజాగ్రత్తగా నిద్రమత్తులో వాహనం నడుపుతుండటంతో కొత్తపల్లి- నుస్తులాపూర్ మధ్యలో ఉన్న కల్వర్టులోనికి దూసుకెళ్లి బోల్తాపడింది. గమనించిన స్థానిక రైతులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు, ఫైర్, టోల్‌గేట్ సిబ్బంది స్థానికులు కంటెయినర్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌ను 108 వాహనంలో కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. డ్రైవర్ యాదద్రి జిల్లా, గుండాల మండలం, అనంతరం గ్రామానికి చెందిన చెరుపల్లి సాగర్(29)గా గుర్తించారు.

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ వాడకాన్ని ఎక్కువ వినియోగిస్తూ భూమి సారాన్ని పెంచాలని, తద్వారా రైతులు లాభాలు పొందాలని సూచించారు. పచ్చిరొట్టకు సంబంధించిన జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి వాటిని నేలల్లో వెదజల్లి కలియదున్నాలన్నారు. అప్పుడే భూమిలో సూక్ష్మధాతువులు మంచి పంటను అందించాలంటే సత్తువ గల భూమిని తయారు చేయాలన్నారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కారులో ఊపిరాడక యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన పసునూరి రాజేశ్ (35) అనే వ్యక్తి కారులో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన రాజేశ్ ఫ్రూటీ, హ్యాపీ ఫిజ్ అనే శీతలపానీయాల హెడ్‌గా పనిచేస్తుంటాడు. ఇదే క్రమంలో ఈ నెల 18న రాత్రి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో గల గోదాంకు స్టాక్ వచ్చిందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి రాజేశ్ బయటకు వెళ్లాడు. ఆ రోజంతా ఇంటికి రాకుండానే సోమవారం ఉదయం 6గంటలకు అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత తన కారును కొత్త బస్టాండ్ సమీపంలో పార్క్ చేసుకొని మద్యం సేవించి కార్ లాక్ చేసుకొని అందులోనే ఉన్న రాజేశ్ ఊపిరాడక మృతి చెందాడు. అయితే తన భర్త ఇంటికి రాలేదని బయటకు వెళ్లి చూస్తే లేకపోవడంతో అనుమానం వచ్చి సోమవారం రాత్రి 11.30 గంటలకు కారు వద్దకు వెళ్లి చూసేసరికి తన భర్త కారులోనే చనిపోయి ఉన్నాడని గుర్తించి చుట్టుపక్కలవారికి, కుటుంబ సభ్యులకు భార్య బాలమణి సమాచారం అందించింది. గత 2019 నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని, ఇదే క్రమంలో అతిగా మద్యం సేవించడం వల్ల కారులో ఊపిరాడక డీహైడ్రేషన్ వల్ల చనిపోయి ఉంటాడని రాజేష్ భార్య పోలీసలుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన భర్త మృతికి ఎవరిపై అనుమానం లేదని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగను పోలీసులు పట్టుకొని సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి సత్యనారాయణ హమాలీ పని చేసుకొని జీవిస్తున్నాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో సొంత అవసరాల కోసం ఈజీగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో తన ఇంటి దగ్గరలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. బీరువా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గొల్లపల్లి బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు లక్ష్మీహారం, నెక్లెస్, రెండు చైన్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన ఎస్ఐ రమాకాంత్, పీఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు బాబయ్య, రషీద్, శ్రీనాథ్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


గోదావరికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న భక్తులు


నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు...

భూపాలపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివచ్చి సరస్వతి అంతర్వాహినిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉదయం 12 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత కాళేశ్వర క్షేత్రానికి తరలి వచ్చి పుష్కరస్నానాలు చేశారు. మూడు రోజులపాటు పోటెత్తిన భక్తుల సంఖ్య రెండు రోజుల్లో కొంత తగ్గినప్పటికీ భక్తులు సెంటిమెంట్ ప్రకారం పుణ్య స్నానాలకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.



మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గత మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రేలింగ్ చేశారు. భక్తులరాక వల్ల రోడ్డు పై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను చల్లు తూ క్యూరింగ్ చేస్తున్నారు. మంగళవారం పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పందిళ్లు, తాగునీరు, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీని జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాలు జరుగుతున్న ఘాట్లలో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించారు.



ఏఎస్సైలకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో పలు పోలీస్ స్టేషన్‌లలో ఏఎస్సైలుగా పని చేస్తున్న తొమ్మిది మందికి ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మల్టీజోన్ నుంచి మొత్తం 22 మంది ఏఎస్సైలు పదోన్నతులు పొందారు. వీరందరిని ప్రస్తుతం జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే పోలీస్ స్టేషన్ల కేటాయింపు, పోస్టింగ్‌లు వెలువడనున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఎనిమిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరి చొప్పున డీబార్ చేసినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మ నగర్ పరిధిలో మానేరు జలాశయం నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. నీటి గుంతలో వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రి బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చల్లగా చూడమ్మా..

- బద్ది పోచమ్మకు బోనం మొక్కులు
- క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాన్ని సమర్పించి పిల్లాపాపలు పాడిపంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు.


అమ్మవారి దర్శనం కోసం బోనాలతో క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

చిన్నకలువలలో సీతారాముల కల్యాణం

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకలువల సంకట విమోచన వీరహన్‌మాన్ ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వంగపల్లి సుగుణాకర్‌రావు అనసూయ దేవిదంపతుల ఆధ్వర్యంలో సత్య నారాయణచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం కల్యాణం జరగగా సాయంత్రం హవనము, బలిహరణము, తీర్థగోష్టి నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో సీతారామచంద్ర స్వాముల పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం జరిగే హన్‌మాన్ పెద్ద జయంతి వేడుకలకు భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


స్వామివారి ఉత్సవమూర్తులు

బాక్సింగ్‌లో సత్తా చాటుతాం

- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం
- 55 మంది క్రీడాకారులు హాజరు




బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ రింగ్‌లో పంచ్ పవర్ చూపించడ మంటే సాధారణ విషయం కాదు. అలాంటి క్రీడలో ఆరితేరాలంటే ముందుగా ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి. మంచి కండ పుష్టి కలిగి ఉన్నవారే బాక్సింగ్‌లో రాణిస్తారు. ఇటీవల కాలంలో ఒలింపిక్స్‌లో మేరీకోమ్, లవ్లీనా, విజేందర్ ప్రత్యర్థులను మట్టి కరిపించి పతకాలు సాధించారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సింగ్ క్రీడ గ్రామస్థాయికి చేరింది. వేసవి క్రీడాశిబిరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని అనేక మంది చిన్నారులు శిక్షణ పొందుతూ ప్రతిభ చాటుతున్నారు. కోచ్‌లు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్, జి.మురళి చిన్నారులను శిబిరంలో శిక్షణ ఇస్తున్నారు.

● 55 మంది చిన్నారుల హాజరు

కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా క్రీడా శాఖ సంయుక్తంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బాక్సింగ్ క్రీడా శిక్షణ శిబిరానికి 55 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్‌లు అధునాతనమైన టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు.

నిఖత్ జరీన్ రోల్ మోడల్ జి.హరిణిశ్రీ, కరీంనగర్



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ నాకు రోల్ మోడల్. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి అందరి అభిమానాన్ని చూరగొంది. నేను కూడా ఆమెలా బాక్సింగ్ నేర్చుకుంటాను. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిథ్యం వహించేందుకు కృషి చేస్తా.

మంచి బాక్సర్‌గా ఎదుగుతా

జి.హరిహరన్, కరీంనగర్

మంచి బాక్సింగ్ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందు కోసం ఈ వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల్లో బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. కోచ్‌లు శిక్షణలో మెళకువలను నేర్పిస్తున్నారు. ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు ధన్యవాదాలు.







పెట్రోల్ బంక్‌ల్లో పలు సేవలు

సౌకర్యాలు పొందడం వినియోగదారుల హక్కు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొట్టించుకోకపోయినా కొన్ని సేవలను వినియోగదారులు ఉచితంగా పొందవచ్చు. పెట్రోల్ బంక్‌కు వెళ్లినప్పుడు చాలా మంది తమ వాహనాలను ఇంధనం నింపించుకోవడమే కానీ అక్కడ అందుబాటులో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని తెలుసుకోరు. అంతేకాకుండా కొన్నిసార్లు బంక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, గాలి నింపడం కోసం డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తుంటారు.

- వాహనాల టైర్లలో గాలి నింపే మిషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అక్కడ నిరంతరం ఒక వ్యక్తి అందుబాటులో ఉండి ఉచితంగా సేవలందించాలి. కస్టమర్ తన ఇష్టానుసారం ప్రకారం డబ్బులు ఇవ్వవచ్చు. డబ్బులు డిమాండ్ చేయరాదు.
- స్త్రీలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి బంక్‌లో శుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి.
- తాగునీటి కోసం స్వచ్ఛమైన ఆర్వో వాటర్ అందించాల్సిన బాధ్యత బంక్ యాజమాన్యందే. ఎవరైనా ఉచితంగా ఆ నీటిని వినియోగించుకోవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఉపయోగించు కునేందుకు ప్రథమ చికిత్స అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు ఫోన్ సౌకర్యం ఉండాలి.
- పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం ఉంటే బంక్‌లోనే పరీక్షించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పరీక్షలకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు అందజేయాల్సిన బాధ్యత కూడా బంక్ సిబ్బందిదే. ఇంధనం తక్కువగా వచ్చినట్లు అనుమానం వస్తే అక్కడే చెక్ చేసుకోవాలి.
- వినియోగదారుల ఫిర్యాదు కోసం ప్రత్యేకంగా పెట్టె ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంక్‌లో సరైన సౌకర్యాలు లేనట్లయితే సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత చమురు సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు.

భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) టోల్ ఫ్రీ నంబర్ 1800224344,
ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) 18002333555,
హెచ్‌పీఎల్ 18002333555, రిజియన్స్ 18008919023
నంబర్లకు ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేయవచ్చు. వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. పెట్రోల్ బంక్‌ల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం ద్వారా మీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చు.

కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధిగా సురేష్

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన గండికోట సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంటకరమణారెడ్డి అధికార ప్రతినిధిగా నియామకం అయిన సురేష్‌ను అభినందించారు.

కొప్పుల అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తాం

- మిగతా మంత్రుల్లాగా ఈ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- 2014 నుంచి అక్రమ కేసులు పెట్టి రాక్షస పాలన చేసింది నీవు కాదా?
- 15 నెలల్లోనే మా ప్రభుత్వంపై ఆక్రోశం ఎందుకు?

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర వ్యాప్తంగా కూడగట్టిన అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మారం, వెల్గటూర్ మండలాల కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలతో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను సందర్శిద్దామని, అక్కడి మంత్రులు చేసిన అభివృద్ధిని తోటి మంత్రిగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయారో చెప్పాలని ప్రశ్నించారు.

ధర్మపురి నియోజకవర్గ డీఎంఎఫ్‌టీ నిధులు 15 వందల కోట్లు సిద్దిపేటకు, 2 వేల కోట్లు గజ్వేల్‌కు తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్‌రావు మేడారంలో రాత్రిళ్లు బస చేసి మన నీళ్లను సిద్దిపేటకు తీసుకపోతుంటే కొప్పుల ఎందుకు అడ్డుకోలేదని అడ్లూరి ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిగా ఉండి నియోజకవర్గానికి చేసిన ఒక్క పని చూపించాలని ఎద్దేవా చేశారు. మీ పాలనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టారని, సామాన్య ప్రజలనుంచి నీకు వ్యతిరేకంగా వార్తలు రాసిన రిపోర్టర్ల దాక కేసులు పెట్టి వేధించావని గుర్తుచేశారు. ప్రభుత్వం వచ్చి 15 నెలల కాలంలోనే మీకు ప్రభుత్వంపై, నాపై అంతా ఆక్రోశం ఎందుకని, మరో మూడు సంవత్సరాల వరకు 10 ఏండ్లలో నీవు చేయని అభివృద్ధిని నేను చేసి చూపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.


తనపై పెట్టిన కేసుల వివరాలను చూపిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ మండలంలోని పాశి గామలో ఇథనాల్ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష నాయకుడిగా నేను వ్యతిరేకిస్తే నాపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన నాన్ బేయిలేబుల్ కేసుల ప్రతులను సమావేశంలో అడ్లూరి ప్రదర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు చొప్పదండి నియోజకవర్గంలో ఎకరాకు 20 లక్షలు ఇప్పిస్తే, ఇక్కడి రైతులకు 7 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని, మీకు మెగా కంపెనీకి ఉన్న లోపాయికార ఒప్పందం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 నుంచి 2023 వరకు కొప్పుల రాష్ట్ర వ్యాప్తంగా సంపాదించిన అక్రమ ఆస్తులను, హైదరాబాద్ శివారులోని స్టోన్ మెటల్ క్వారీస్ సంబంధించిన వివరాలు ప్రజలు ముందు పెడుతామన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి మాజీ మంత్రి ఉసిగొల్పుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు సంయమనం పాటించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని హితకు పలికారు.

●సంక్షిప్తంగా..

పుస్తకావిష్కరణకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్ మే 20 (ఆంధ్ర జ్యోతి): రచయిత సబ్బని లక్ష్మీనారాయణ రచించిన 'నా చార్ ధామ్ ఆధ్యాత్మిక యాత్ర' పుస్తకాన్ని ఈ నెల 31న ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో కస్తూరి విజయంవారి ఆధ్వర్యంలో (ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ సాహిత్యోత్సవం) ఆవిష్కరించనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మంగళవారం ఆహ్వానించారు. అరబిందో సొసైటీ కరీంనగర్ సెంటర్ అధ్యక్ష కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కరీంనగర్ అర్బన్ మే 20 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని పలువురు లబ్ధిదారులకు టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నవారు ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆశ్రయించారని, సీఎంఆర్ఎఫ్ మంజూరైందని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్ మే 20(ఆంధ్రజ్యోతి): ఆటో ఆకలి కేకల మహాసభ పోస్టర్‌ను బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇందిరాపార్కు వద్ద సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఆటో కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మద్దుల రాజేందర్, ఉపాధ్యక్షుడు రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న విగ్రహావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ వినియోగదారుల మండలి, సమాచార హక్కు రక్షణ వేదిక సంస్థల వ్యవస్థాపకుడు నరెడ్ల శ్రీనివాస్ విగ్రహాన్ని ఈ నెల 23న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించనున్నట్లు కపిసొ అధ్యక్ష కార్యదర్శులు రవిచంద్ర, లక్ష్మీగౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి, వినియోగదారుల మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, లోక్ సత్తా ఉద్యమ సంస్థ అధ్యక్షుడు ప్రకాశ్ హోల్లా, హక్కు రక్షణ వేదిక అధ్యక్షుడు గంగాధర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ఎప్పుడో?

- ప్రారంభం కానున్న వానాకాలం సీజన్
- ఆందోళనలో అన్నదాతలు
- ధరల పెంపుతో ఆర్థిక భారం


సాగు చేసిన జీలుగ (ఫైల్)

కరీంనగర్ రూరల్, మే 20 (ఆంధ్ర జ్యోతి): పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జాప్యమవుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్‌కు సన్నద్ధమైన రైతులు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము కోసం నిరీక్షణ తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. వరినాట్లకు నెల రోజుల ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే మొలకెత్తుతాయి. సాగుకు ముందు పొలంలో కలియదున్నడంతో నేలకు బలం చేకూరుతుంది. అయితే విత్తనాల సరఫరా జాప్యంతో

కొందరు జీవాలు, కోళ్ల ఎరువు తీసుకొచ్చి పొలాల్లో చల్లుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుండడంతో పలువురు రైతులు పచ్చి రొట్ట విత్తనాలను సాగుకు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ అధికారులు సైతం పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పించారు.

నియోజకవర్గంలోని కరీంనగర్ మండలానికి 150 క్వింటాళ్లు, కొత్తపల్లి మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించారు. స్టాక్ రాక రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ధరల పెంపుతో అదనపు భారం

ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుండగా ధరలను పెంచడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. గతేడాది జీలుగ క్వింటాల్ ధర రూ.9,300 ఉండగా సబ్సిడీ పోగా 3,700 రైతు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం రూ.14,250 ఉండగా సబ్సిడీ పోను రూ.7125 చెల్లించాలి. గతంలో జనుము క్వింటాల్ ధర రూ.9,050 ఉండగా సబ్సిడీ పోను రూ.3,620 చెల్లించాలి. ప్రస్తుతం రూ.12,550 చేరడంతో సబ్సిడీ పోను రూ.6,275 రూపాయలు చెల్లించాలి. స్టాక్ రాగానే పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్టు అమలు

కరీంనగర్ క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా దారులు పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్టు అమలు చేయాల్సి ఉంటుందని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలించిన కేసుల్లో నిందితులుగా ఉన్న చేగుర్తి, దుర్శేడ్ గ్రామాలకు చెందిన నలుగురు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. సమావేశంలో ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కొనసాగుతున్న నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసాయి. యజ్ఞాచార్యులు వానమామలై పవన కుమారాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై విహరిస్తూ శ్రీవారు కనువిందు చేశారు. రాత్రి పుష్పయాగం, ద్వాదశారాధనలు, సప్తావరణాలు, ఏకాంత సేవ నిర్వహించారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు యూనివర్సిటీలపై విచారణ జరిపించాలి

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు ప్రైవేటు, మూడు డీమ్డ్ యూనివర్సిటీలపై విచారణకు ఉన్నత విద్యా మండలికి అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యా మండలికి అవకాశాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి వద్దే అధికారాలు ఉండే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ ఉన్నత విద్యా మండలికి అధికారాలు కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేష్ నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలను తగ్గించాలి

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రసూతి మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మంగళవారం జిల్లా స్థాయి మాతృ మరణ కమిటీ(ఎండీఆర్)తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనాజవేరియా, పీవోడీటీ డాక్టర్ ఉమాశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, డాక్టర్ సుహాసిని, డాక్టర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరం షష్టగ్రహ కూటమితో ప్రారంభమైన దృష్ట్యా లోక కల్యాణార్థం సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో మంగళవారం ప్రధానార్చకుడు కలకుంట్ల రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. డింగరి శ్రీరామాచార్యులు, వివరాంబాధ ప్రవీణ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కరీంనగర్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈవో రవీందర్ అన్నారు. కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యయులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. కోర్సు డైరెక్టర్ ఎం. మధుసుధనాచారి, రిసోర్స్ పర్సన్స్ సీహెచ్ శ్రీకాంత్, పి. శ్రీనివాస్, కె. మహిపాల్‌రెడ్డి, డి. సుజాత, రవి, పరిమళ ఉన్నారు.

సైదాపూర్ : మండల కేంద్రంలోని వెన్కేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైనట్లు ఎంఈవో తెలిపారు. శిక్షణ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే20(ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏడీఈ గాదం రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, చెర్లబూత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, ఫకీర్ పేట, జూబ్లీ నగర్, బహదూర్ ఖాన్‌పేట్, తహెర్ కొండాపూర్, ఎలబోతారం, ఉదయం 9 గంటల నుంచి 10 వరకు ఆసిఫ్‌నగర్, బావుపేట, గ్రానైట్ పరిశ్రమలు, ఉదయం 8 గంటల నుంచి 11 వరకు సీతారాంపూర్, ఆర్టీసీకాలనీ, బాలాజీ నగర్, సాయిబాలాజీ నగర్, సూర్యనగర్, జగిత్యాల రోడ్, బృందావాన్ కాలనీ, గౌడ్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంసిద్ధత మేళా

కరీంనగర్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం ప్రథం ఎన్‌జీవో ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అర్బన్ సీడీపీవో సబితా కుమారి మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాలు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. దుర్శేడ్ సెక్టార్ సూపర్ వైజర్ నిర్మల, ప్రథం ఎన్జీవో మాస్టర్‌ట్రైనర్ రాజేందర్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

రూ.20వేల ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన పేషంట్‌కు చికిత్స నిమిత్తం డాక్టర్ బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు మంగళవారం రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్‌కు చెందిన శివకుమార్ అనే యువకుడు కొంతకాలంగా లివర్ రక్తనాళంలో ప్రసరణ మందగించడంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కోరుట్లకు చెందిన డాక్టర్ అనుప్‌రావు అతడి ఆర్థిక పరిస్థితిని డాక్టర్ బీఎస్ రావు దృష్టికి తీసుకెళ్లారు.


చెక్కు అందజేస్తున్న డాక్టర్ బీఎస్ రావు

కవి మేరుగు అంజయ్య మృతి

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 20: తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యదర్శి, కవి మేరుగు అంజయ్య (56) మంగళవారం మధ్యాహ్నం గుండె పోటుతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. రెండు రోజుల క్రితం ఆయన అల్సర్‌తో ఆస్పత్రిలో చేరారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. దశాబ్ద కాలంగా తెరవే జిల్లా కార్యవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. అంజయ్య మృతిపై తెరవే రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీపీ కుమార్, దామరకుంట శంకరయ్య, కవులు, రచయితలు డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, గాజోజు నాగభూషణం, దేవేందర్, అంజయ్య, తిరుపతి, పీఎస్ రవీంద్ర, నిర్మలారాణి. సరసిజ, రవీందర్ సంతాపం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా హరీష్

కరీంనగర్ రూరల్/సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దుబ్బాసి హరీష్(చందు)ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమకానికి సహకరించిన అందరికీ హరీష్ కృతజ్ఞతలు తెలిపారు.

మండల కార్యవర్గం

కరీంనగర్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ రూరల్ మండల కమిటీని మంగళవారం చామనపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపల్లి మోక్షిత్, ప్రధాన కార్యదర్శులుగా తుప్పట్ల రాజు, గాలిపల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా బుచ్చల అనిల్, దావు మల్లేశం, మోదుంపల్లి అనిల్, తప్పట్ల విఠల్, కార్యదర్శులుగా అలువాల ప్రశాంత్, చామనపల్లి గణేష్, దావు శ్రీనివాస్, తాండ్ర ధ్రువ కుమార్, కాసాపాక ఉమేష్, వడ్రుఇ శ్రీకాంత్, కోశాధికారిగా ఇరుగురాల వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. తెలంగాణ అంబేడ్కర్ యువజన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జల కాంతం, జిల్లా అధ్యక్షుడు మాదాసి ప్రభాకర్ పాల్గొన్నారు.

డంపుయార్డు సమస్యను పరిష్కరించాలి

కరీంనగర్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ డంపుయార్డు సమస్యను పరిష్కరించాలని డంపుయార్డు బాధిత సంఘం నాయకులు కోరారు. మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లో కలిసి సమస్యను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి మోహన్‌లాల్ కట్టర్‌కు లేఖను పంపాలని మంత్రి ఓఎస్‌డీని ఆదేశించినట్లు బాధిత సంఘం సభ్యులు శ్రీనివాస్‌పటేల్ తెలిపారు. అంతకుముందు మంత్రికి వినతిపత్రం అందజేశారు.


వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

ఫిన్‌లాండ్ పర్యటనలో పారమిత చైర్మన్ ప్రసాదరావు

కరీంనగర్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పారమిత, ఎక్స్‌ప్లోరికా పాఠశాలల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు ఆధునిక విద్యావ్యవస్థ పరిశీలనలో భాగంగా ఫిన్‌లాండ్‌లో పర్యటిస్తున్నారు. భారత్ నుంచి వెళ్లిన 20 మంది సభ్యుల బృందంలో ప్రసాదరావు ఒకరు. ఈ బృందం ఈ నెల 14 నుంచి 20 వరకు ఫిన్‌లాండ్ విద్యా వ్యవస్థను పరిశీలించింది. ఆ దేశంలో భారత రాయబారిగా పనిచేస్తున్న హేమంత్ హెచ్ కోటక్వార్ నుంచి ప్రసాదరావు అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సైబర్ క్రైమ్స్‌పై అవగాహన

హుజూరాబాద్‌రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న నేషనల్ క్యాండిడేట్ క్రాప్స్ అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం కరీంనగర్ సైబర్ క్రైమ్ టీం సభ్యులు ఎన్‌సీసీ కేడెట్లకు సైబర్‌క్రైమ్స్ పట్ల అవగాహన కల్పించారు.అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంక్ వివరాలను అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నర్ జయంత, టీఎస్ ఎన్సీ టీం లీడర్ అక్రమ్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఇసుక లారీ

మానకొండూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని తూర్పుదర్వాజ బస్టాండ్ కూడలి వద్ద ఓ లారీ వెనుకకు వెళ్తున్న సందర్భంలో మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోయి పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్ధరించారు.

హుజూరాబాద్‌లో బీజేపీ తిరంగా ర్యాలీ

హుజూరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ తిరంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రమూకల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిందన్నారు. ఇండియన్ ఆర్మీ సత్తా చాటి దేశభక్తిని ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి రాజు, గుర్రం నిర్మలారెడ్డి, ఎరబెల్లి సంపత్ రావు, రాజు, శ్రీనివాస్, నరేష్, కొండాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పీసీసీ పరిశీలకులు

హుజూరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని కరీంనగర్ జిల్లా పీసీసీ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ పిన్నింటి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు అధ్యక్షతన సంస్థాగత నిర్మాణ సమావేశం నిర్వహించారు.

● జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని కరీంనగర్ జిల్లా పీసీసీ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ పిన్నింటి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అధ్యక్షతన సంస్థగత నిర్మాణ సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

● వీణవంక: మండలంలోని కాంగ్రెస్ పార్టీ పదవుల కోసం కార్యకర్తలు మంగళవారం పరిశీలకులకు దరఖాస్తులు సమర్పించారు. ఈ సమావేశానికి జిల్లా పరిశీలకులు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నమిండ్ల శ్రీనివాస్‌పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌లు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు భగవాన్ రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, నల్ల కొండల్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, మందా అనిల్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

మానకొండూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మాట్లాడుతూ మండల రైతులు సేంద్రియ సాగుతో ఆరోగ్యంగా జీవించడమే కాకుండా భూమిని కాపాడుకోవచ్చన్నారు. ఫర్టిలైజర్లు వాడడం వల్ల ఆరోగ్యం చెడిపోయి భూసారం తగ్గిపోయి చవుడు నేలలు తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతే కాకుండా యూరియా వాడకాన్ని తగ్గించి, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. మామిడి, ఆయిల్ పామ్, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషారాణి, శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.


అవగాహణ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

హజరత్ షేర్ అలీ బాబా దర్గా అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి): అలుగునూర్ తీగల వంతెన సమీపంలోని హజరత్ షేర్ అలీ బాబా దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను దర్గా కమిటీ బాధ్యులు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా దర్గా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేదుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు మహ్మద్ వాజీద్ అలీ, ప్రధాన కార్యదర్శి నదీముద్దీన్, ఉపాధ్యక్షులు ఎండీ. ఇర్ఫాన్ మొహి యుద్దీన్, అయూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శులు మీర్జా యూసుఫ్ బేగ్, సలీం, కోశాధికారి అలీ, సలహాదారులు మౌలానా అలీముద్దీన్, నిజామి పాల్గొన్నారు.

మానకొండూర్‌లో ఆశావర్కర్ల నిరసన

మానకొండూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో మంగళవారం ఆశా కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు రోడ్డుపై మానవహారంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆశాకార్యకర్తలకు నెలకు రూ. 26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

వీణవంక,మే20(ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా రజిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన మంజుల వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రజిత ను మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, మండల నాయకులు సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూ రి మదుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిడి సంజీవరెడ్డి సన్మానించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ముగ్గురు రైతులు 24క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

రామడుగు, మే 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ డిమాండ్ చేశారు. దుశ్చర్యకు పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్, జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హుజూరాబాద్‌కు చినజీయర్‌స్వామి రాక

హుజూరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రామాలయంలో జరిగే ధ్వజారోహణ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 22న హుజూరాబాద్‌కు చినజీయర్ స్వామి రానున్నట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూరాబాద్‌లోని రామాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులు, ఆలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న రామాలయంలో జరిగే ధ్వజారోహణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పెద్దఎత్తున భక్తులు హాజరవుతారని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, ట్రాఫిక్, వైద్యం లాంటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ సీఐ కరుణాకర్, విద్యుత్ అధికారులు, నాయకులు శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, పూర్ణచందర్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

●సంక్షిప్తం

●జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో హనుమాన్ శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు గుండెకారి మధు, నరసింగ రావు, శంకర్, హరీష్ తదితరులు ఉన్నారు.

● మానకొండూర్:మానకొండూర్‌లో హన్మాన్ మాలదారులు మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన జవ్వాజి మహేందర్‌ఆధ్వర్యంలో మాలదారులకుసహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు.

● గంగాధర : గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ పరిధిలోని ఇస్తారుపల్లిలో కళ్లెం నారాయణ(60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు ఎండీ నజీర్‌హుస్సేన్ ఉన్నారు.

● చిగురుమామిడి: మండలంలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించాల్సిన జీలుగు విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్ అన్నారు. ఇప్పటికైనా స్పందించి పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని కోరారు.

● హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కండె రాజు(30) ఈ నెల 15న గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఉమేష్ చంద్ర ఆటో యూనియన్, పోతిరెడ్డిపేట రూట్ ఆటో అసోసియేషన్ సభ్యులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ. 5 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందించారు.

● తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో ఒకరు మృతి చెందగా అంత్యక్రియల సందర్భంగా డప్పు కొట్టే క్రమంలో, పాడె మోసే క్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు వర్గాల వారు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

● జమ్మికుంట: జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అబ్జర్వర్లకు మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజు మంగళవారం తన ప్రొఫైల్‌ను అందజేశారు.